

19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

రంగారెడ్డి వికారాబాద్ మేడ్చల్

బుధవారం 21 జనవరి 2026 పేజీలు 12





బూర్గుల గ్రామంలో ఉన్న పీహెచ్‌సి

# అతడిది ఎప్పుడూ పాడుబుద్దే..!



- ఈ డాక్టర్ మాకొద్దు - భరించలేక పోతున్నాం
- కిందిస్థాయి మహిళా సిబ్బందిపై వేదింపుల ఆరోపణలు
- గతంలో డిఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినా మారని తీరు
- మాట వినకుంటే అట్రాసిటీ పెడతానని బెదిరింపులట

3 లో

వైద్యుడంటే సమాజంలో ఉన్నతమైన గౌరవమే కాకుండా పూజ్యభావం కూడా అందరిలోనూ ఉంటుంది. వ్యక్తి ప్రాణాలు కాపాడే అవకాశం, నైపుణ్యం ఉన్న సదరు వైద్యుడి పట్ల సమాజం మొత్తం కృతజ తాభావంతో ఉంటారు. అయితే అంతటి వ్యవస్థలో ఉండి కూడా కొందరు నికృష్టపు చేష్టలకు తెగపడుతున్నారు. సమాజం అంతా వారిని గొప్పవారిగా పూజిస్తుంటే వారి బుద్దులు మాత్రం పాతాళంలోనే ఉంటున్నాయి. షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (జనవరి 20):

# కాంగ్రెస్ జెండా మోసిన వారికే మున్సిపల్ టికెట్లు



- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగుర వేసేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

3 లో



# ఉద్యానవన పంటల సాగుపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి

- రైతులు అధిక దిగబడులు పొంది ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

8 లో



3 లో

## విపత్తు పరిస్థితుల్లో మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగం

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

# పెద్దేముల్ మండలంలో జోరుగ అక్రమ మట్టి తవ్వకాలు

- రెవెన్యూ, మైన్స్ అధికారుల అండదండలతో కర్ణాటక రాష్ట్రంకు మట్టి తరలింపు
- లీజు రాయల్టీ లేకుండనే పట్టపగలు దర్జాగా మట్టి తరలింపు
- ఫిర్యాదులు చేసిన పట్టించుకోని రెవెన్యూ మైన్స్ అధికారులు

3 లో



పెద్దేముల్ మండల రాంసింగ్‌తండా వద్ద అసైండ్ భూమిలో నుండి తరలిస్తున్న అక్రమ ఎర్ర మట్టి

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- ★ 8 తులాల బంగారం, 50 తులాల వెండి, 3 సెల్ ఫోన్లు స్వాదీనం
- ★ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

11 లో






# కలకొండలో విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులు ప్రారంభం

## ★యేండ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం పట్ల గ్రామస్థులు, రైతుల హర్షం



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జనవరి 20): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కల్వకుర్తిమొదటి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి హాయంలో మాడ్గుల మండలంలోని కలకొండతో పాటు బ్రాహ్మణపల్లి, అందుగుల గ్రామాలకు 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. కాగా గత కొన్ని సంవత్సరాల కిందట అందుగులలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రాగా కలకొండ, బ్రాహ్మణపల్లి గ్రామాలలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఆరంభానికి నోచుకోక శంఖుస్థాపనలతోనే ఆగిపోయాయి. ఈ క్రమంలో ఈనెల 11న మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిల దృష్టికి గ్రామ మాజీ సర్పంచ్ గౌర్రె రవీందర్‌రెడ్డి, ప్రస్తుత సర్పంచ్ నకిరెకంటి లక్ష్మమ్మబుచ్చమయ్యలు స్థానిక నాయకులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి నోచుకోని విషయాన్ని వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, ఎంపి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో కలకొండ సమీపంలో గత ప్రభుత్వహాయంలో అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి, అప్పటి కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్‌లు శంఖుస్థాపన చేసిన స్థలంలో విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం, మంగళవారం విద్యుత్‌శాఖ ఏడిఏ శ్రీనివాస్, ఏఈ కన్‌స్ట్రక్షన్ భవానీ, మాడ్గుల ట్రాన్స్‌కో ఇంచార్జ్ ఏఈ గిరిబాబు , కాంట్రాక్టర్ జగన్మోహన్‌లతో పాటు మండల గిర్ధవరు యాదయ్య, సర్వేయర్ ప్రభుదాస్, లైన్‌మెన్ నరేష్, రసూల్, తానేష్‌లు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలంలో జెసిబి యంత్రంతో చదును చేయించడంతో పాటు నిర్మాణానికి మార్కింగ్ చేశారు. దీంతో యేండ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి నోచుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపి మల్లు రవిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల ప్రారంభం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్

# నిమిషం నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి : యోగేష్ గౌతమ్





మొయినాబాద్ మేజర్ న్యూస్( జనవరి 20) నిమిషం, నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలి తీసుకుంటుందని, మనం ప్రతి రోజు ఇంట్లో కన్న రోడు పైనే ఎక్కువ సమయం కేటాయిస్తామని చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతం పేర్కొన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జేపీఎల్ కన్వేన్షన్ హాల్లో రోడ్డు ప్రమదాల నివారణపై చేవెళ్ల జోన్ పరిధిలోని డ్రైవర్లకు నిర్వహించిన అవగహన కార్యక్రమంలో మాజీ మంత్రి, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో కలిసి డీసీపీ యోగేష్ గౌతం పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అదేశాలకు అనుగుణంగా రాష్ట్ర పోలీసు శాఖ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జనవరి నెలలో వారోత్సవాలను నిర్వహిస్తుందని తెలిపారు. నెలపాటు జరిగే ఈ అవగహన కార్యక్రమాల్లో ప్రతి రోజు అన్ని రంగాలకు చెందిన డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు 8వ రోజు అని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయం, పోలీసులకు అందిన సమయానికి ముందు సంఘటన జరిగిన ప్రదేశంలో స్థానికులు ఉంటారని వారు భాధ్యతగా సహకరించిట్లు అయితే వారు గొప్ప వ్యక్తులని చెప్పారు. వాహనం నడిపే సమయంలో పోటీతత్వం ఉండకూడదని గతంలో తాను గుజరాత్ రాష్ట్రానికి కుటుంబ సభ్యులతో వెళ్లిన సందర్భంలో జరిగిన ఘటనలను గుర్తుచేశారు. దేశంలో ప్రతి ఏడాదికి లక్షకు పైగా రోడ్డు ప్రమాదంలో మృతి చెం దుతున్నారని తెలిపారు. డ్రైవింగ్ అనేది ఒక పెద్ద బాధ్యత అని తెలిపారు. గతంలో నేను నారాయణపేట జిల్లాలో పనిచేసినప్పుడు రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారని ఆ మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు అక్కడ ఉన్న కానిస్టేబుల్ అనేక వాహనాలను ఆపేందుకు ప్రయత్నం చేశారని కానీ ఎవ్వరూ ఆపలేదని తీరా అతనే తన వాహనంలో మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారని గుర్తుచేశారు. మనం ఇంట్లో కన్న రోడ్డుపైనే ఎక్కువ సమయం కేటాయిస్తామని.. రోడ్డుపై జరిగే ప్రమాదాల సమయంలో మనం అక్కడ ఉంటే ఏదో ఒక రకంగా సహాయం చేయాలని తెలిపారు. తద్వారా మనం వాళ్లకు జీవితాన్ని ఇచ్చిన వారిగా నిలిచిపోతమని సూచించారు. అంతేకాకుండా ప్రమాదంలో చిక్కుకున్న వారికి అండగా నిలిచే వారికి పోలీసుల నుంచి ఇబ్బందులు వస్తాయనే అపోహ వద్దని. పైగా వారికి పోలీసు శాఖ నుంచి తగిన ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని హామి ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఎవరూ ప్రమాదాలు జరగాలని వాహనం ఎక్కరని దూరదృష్టవత్తు ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి అనేక మంది వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి చేవెళ్లలో కేంద్రం ఏర్పాటు చేసి లర్నింగ్ లైసెన్సు ఇవ్వాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు. తాను వ్యక్తిగతంగా వెయ్యి హెల్మెట్లు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిషన్, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా రవాణ శాఖ అధికారిణి సాయి కృష్ణవేణి, మెహదీపట్నం డీపో మేనేజర్ కృష్ణమూర్తి, జోన్పరిధిలోని సీఐలు పవన కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ లో గహనకు సంబందించిన వాల్ పోస్టర్ను డీసీపీ యోగేష్ గౌతం విడుదల చేశారు.

# మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచన : సబితా రెడ్డి

**అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హనుమంత్‌కు ఎమ్మెల్యే సబితా పరామర్శ**



బాలాపూర్, మేజర్ న్యూస్ (జనవరి 20): మాజీ కార్పొరేటర్ సురేఖ మామ మదారి రమేష్ తండ్రి మదారి హనుమంత్ అనారోగ్యంతో ఆసుపత్రి అత్యవసర సేవల విభాగంలో చికిత్స పొందుతున్నారని తెలిసిన వెంటనే, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లను అడిగి హనుమంత్ ఆరోగ్య పరిస్థితిని వివరంగా తెలుసుకున్న సబితా ఇంద్రారెడ్డి, ఆయనకు అత్యుత్తమ నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకొని కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబానికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే అనారోగ్య పరిస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, అవసరమైన అన్ని సహాయాలు అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మదారి రమేష్, మురుకుంట్ల అరవింద్ తదితరులు ఉన్నారు.

## బడంగ్‌పేట్‌లో ఆర్యవైశ్య సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



బాలాపూర్, మేజర్ న్యూస్ (జనవరి 20): మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్‌ఎంసీ పరిధిలో గల బడంగ్‌పేట్ సర్కిల్ డివిజన్లో బడంగ్‌పేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘాలు సామాజిక సేవల్లో ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఐక్యతతో పాటు సేవాభావంతో ముందుకు సాగితే సమాజాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. నూతన సంవత్సరం అందరికీ ఆరోగ్యం, అభివృద్ధి, శాంతి సంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్ పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం నాయకులు తోనుపునూరి శ్రీనివాస్ గుప్తా, దాచేపల్లి వెంకటేశ్వర్లు, విరమల్లి రామమూర్తి, కమిటీ సభ్యులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులంతా విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

– మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జనవరి 20): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలకు అర్హత పొందాలంటే రైతులంతా విధిగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మాడ్గుల మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి కోరారు. రైతుల ప్రయోజనార్థం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగ బలోపేతంలో భాగంగా వివిధ రకాల పథకాలు అమలుచేస్తున్నందున ప్రతి రైతు వివరాలను ఈ ఫార్మర్ రిజిస్ట్రీ ఐడికి అనుసంధానం చేయబడుతున్నదని ఆమె వివరించారు. ఈమేరకు ఫార్మర్ రిజిస్ట్రీ ఆవశ్యకతపై మంగళవారం రైతులకు అవగాహన కల్పిస్తూ ఫార్మర్ రిజిస్ట్రి చేయడానికి ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబరుతో సంబంధిత రైతు వేదికలో గాని కామన్ సర్వీస్ సెంటర్లలో లేదా మీ సేవా సెంటర్లో గానీ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు.

## వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం



మణికొండ, మేజర్ న్యూస్ (జనవరి 20): మణికొండలోని ఆర్యవైశ్య ఆఫిసియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ మణికొండ శాఖ ఆద్వర్యంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మణికొండలోని బీరప్ప దేవాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మణికొండ శాఖ అధ్యక్షులు దారం వేణుమాధవ్ కార్యదర్శి భానుచందర్ మరియు కోశాధికారి యుగంధర్ ఆద్వర్యంలో నిర్వహించగా పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన మరియు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్ మరియు జిల్లా మహిళా అధ్యక్షురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ జెండా మోసిన వారికే మున్సిపల్ టికెట్లు

## డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (జనవరి 20) :** కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచి.. జెండా మోసిన వారికే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ కేటాయిస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీలో ఏళ్ల తరబడి జెండా మోసి ఇప్పటికీ ఏ పదవికి నోచుకోని కార్యకర్తలు, నాయకులను అధిష్టానం గుర్తించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ టికెట్ల విషయంలో అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తుందన్నారు. పార్టీ టికెట్ ఆశించి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతలకు పార్టీ టికెట్ ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్ ఎవరి ఇవ్వాలనే దానిపై విధి విధానాలను రూపొందించడం జరిగిందని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు కన్వీనర్‌గా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు నియోజకవర్గ ఇంచార్జిలుగా ప్రకటించిన వారితో పాటు ఎంపీ సభ్యులుగా ఉంటారని, అలాగే ఇద్దరు స్థానిక నాయకులు, సభ్యులుగా ఉంటారని చెప్పారు. జిల్లాలో 6 మున్సిపాలిటీలు ఉన్నాయని, 126 వార్డులు ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారైనట్లు చెప్పారు. చైర్మన్ అభ్యర్థులను, వార్డు సభ్యులకు పార్టీ టికెట్ ఇచ్చే అధికారాలు కమిటీకే ఉంటాయని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్వహించే సర్వే ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఒక్కో వార్డు నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లు కమిటీకి పంపితే.. ఆ పేర్లను టీపీసీసీకి నివేదించాకే తుది నిర్ణయం ఉంటుందని ఆయన తెలిపారు.

# విపత్తు పరిస్థితుల్లో మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగం

## జిల్లా రెవెన్యూ అధికారి సంగీత



**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (జనవరి 20) :** వరదలు, పరిశ్రమలలో ప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తెలిపారు. వరదలు వంటి విపత్తులు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈనెల 21న శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళారం ట్రైయిల్ నిర్వహించడం జరిగిందన్నారు. విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి. ఆస్తి, ప్రాణనష్టం నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఎండిఎంఎ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అతడిది ఎప్పుడూ పాడుబుద్దే..!

**షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (జనవరి 20):** వైద్యుడంటే సమాజంలో ఉన్నతమైన గౌరవమే కాకుండా పూజ్యభావం కూడా అందరిలోనూ ఉంటుంది. వ్యక్తి ప్రాణాలు కాపాడే అవకాశం, నైపుణ్యం ఉన్న సదరు వైద్యుడి పట్ల సమాజం మొత్తం కృతజతాభావంతో ఉంటారు. అయితే అంతటి వ్యవస్థలో ఉండి కూడా కొందరు నికృష్టపు చేష్టలకు తెగపడుతున్నారు. సమాజం అంతా వారిని గొప్పవారిగా పూజిస్తుంటే వారి బుద్దులు మాత్రం పాతాళంలోనే ఉంటున్నాయి. తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి చేతికి అందిన కష్టాన్ని చేసుకుంటూ బతుకు బండిని నడిపే మహిళలు ఎందరో ఉన్నారు.. ఆసుపత్రుల్లోనూ నర్సులుగా, ఇతరత్రా విభాగాల్లో పనులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. సరిగ్గా ఇలాంటి మహిళా సిబ్బందిని టార్గెట్ చేసి వేదింపులకు గురిచేస్తూ.. దారికి రాకపోతే బెదిరిస్తూ తన విలనిజాన్ని ప్రద ర్శిస్తున్నాడు ఓ డాక్టర్. దీంతో ఏం చేయాలో తెలియక మహిళా సిబ్బంది అల్లాడుతున్న పరిస్థితి షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఓ పీహెచ్‌సిలో నెలకొంది.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగ ర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల పీహెచ్‌సిలో




పనిచేస్తున్న వైద్యుడి తీరుపై మహిళా సిబ్బంది మండిపడుతున్నారు. డాక్టర్ పిహెచ్‌సిలో పనిచేస్తున్న కింది స్థాయి మహిళా సిబ్బందిని కొంతకాలంగా వేదిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. తన దారికి రాకపోతే వృత్తిపరమైన ఇబ్బందులు సృష్టించి టార్గెట్ చేస్తున్నాడని మహిళా సిబ్బంది వాపోతున్నారు. గతంలో ఈ డాక్టర్ వ్యవహారం పట్ల జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసినా అతని తీరులో మార్పు రాలేదని మండిపడుతున్నారు. ఇతని ప్రవర్తన మార్చుకోవాలని గతంలో ఎమ్మెల్యే పిలిచి చివాట్లు పెట్టి హెచ్చరించినా ఏమాత్రం తగ్గకుండా మరింతగా సిబ్బంది పట్ల రెచ్చిపోతున్నాడని పీహెచ్‌సిలో పనిచేసే మహిళా సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా డాక్టర్‌ని గట్టిగా నిలదీయాలని ప్రయత్నిస్తే అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరిస్తాడని వారు వాపోయారు. మహిళా సిబ్బందిలో కొందరు కాంట్రాక్ట్ బేసిక్‌పై పనిచేస్తుండటంతో సదరు వైద్యుడి వేదింపులు ఎదన్కోనలేక భరిస్తున్నామని మీడియాతో వాపోయారు. సంక్రాంతి పండగ పూట పబ్లిక్ హాలిడేలలో కూడా మహిళా సిబ్బందికి సీఎల్ వేస్తూ పైశాచిక ఆనందం పొందుతాడని వాపోయారు. గతంలో ఇతని వేదింపులు భరించలేక ఇద్దరు మహిళా ఎంఎల్‌హెచ్‌పిలు వెల్లిపోయారన్నారు. స్వయంగా ఉద్యోగం చేసుకుంటుంటే మహిళా సిబ్బంది పట్ల ఇలాంటి వేదింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సిబ్బంది పట్ల చులకనభావం ఉన్న ఇలాంటి వారిపట్ల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పీహెచ్‌సిలో వైద్యుడి ప్రవర్తనా తీరుపై మహిళా సిబ్బందిని సమూహంగా కాకుండా విడివిడిగా విచార ణ చేస్తే మరెన్నో విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెల్లేందుకు సిద్దంగా ఉన్నట్లు వారు తెలిపారు. మరి ఈ వ్యవహారంపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# పెద్దేముల్ మండలంలో జోరుగ అక్రమ మట్టి తవ్వకాలు

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (జనవరి 20):** మండలంలో సహజ సంపద తరలిపోతుంది. పేదల బతుకు దెరువుకు ప్రభుత్వం ఇచ్చిన అసైండ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మైన్స్, రెవెన్యూ అధికారులకు పిర్యాదులు చేసిన కన్నెత్తి చూడటం లేదు. వారికి తెలసిన తమకు తెలియనట్లు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. పెద్దేముల్ మండల సరిహద్దున కర్ణాటక రాష్ట్రం , తెలంగాణ రాష్ట్రంకు చెందిన వ్యాపారులు వనరులను దోచుకుంటున్నారు. అమాయక గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములకు నయానో ...భయానో ఇచ్చి అసైండ్ భూయులను స్వాదీనం చేసుకోని ఎర్ర మట్టి వ్యాపారం బహిరంగంగా కొనసాగిస్తూ సోమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుండి లీజు - రాయల్టీ లేకుండా ప్రతి ఏటా తవ్వకాలు జరిగిన రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపనలు వినబడుతున్నాయి. అక్రమ వ్యాపారస్థులు రాత్రి, పగలు అనకుండా గుట్టు చప్పుడు కాకుండా మట్టి వ్యాపారం జరుగుతున్న అధికారుల్లో మాత్రం చలనం కనబడటం లేదన్న ఆరోపనలు వస్తున్నాయి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలసిన కనీసం కన్నెత్తి చూడటం లేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

పెద్దేముల్ మండల కర్ణాటక సరిహద్దు గిరిజన గ్రామాలతో పాటు పలు గ్రామాలల్లో భూమి లేని నిరుపేదలకు సాగు చేసుకోని జీవనం సాగించడానికి గతంలో ప్రభుత్వం అసైండ్ భూములను పంపిణి చేసింది. అట్టి భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీలకు అవసరమయ్యో విలుకైన మట్టి ఉండటంతో అక్రమ మట్టి వ్యాపారస్థులు వాటిపై కన్నెశారు. కొంత మంది ప్రభుత్వం నుండి లీజులు తీసుకోని మట్టి తరలించగ మరి కొంత మంది ప్రభుత్వం నుండి ఏలాంటి అనుమతి లేకుండా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిదిలోని పాషాపూర్ రెవెన్యూ పరిదిలోని సర్వే



తవ్విన అక్రమ మట్టి గుంతలను పరిశీలిస్తున్న రెవెన్యూ ఆర్ఐ

నెంబర్ 41, 42, 43లో ప్రభుత్వ భూమి ఉంది. అప్పటి ప్రభుత్వం విడుతల వారిగ సుమారు 400 ఎకరాల పైగా భూమిని ప్రభుత్వం భూమి లేని రైతులకు పంట సాగుచేసుకోని బతుకడానికి పంపిణి చేసింది. ఆలాంటి భూములను కొంత మంది దళారులు ప్రభుత్వ అనుమతి లేకుండా ఎర్ర మట్టి వ్యాపారంగా మార్చుకున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై పలు మార్లు జిల్లా కలెక్టర్‌కు కూడ పిర్యాదులు వెళ్లాయి, అప్పట్లో జిల్లా కలెక్టర్‌లు సంబందిత అధికారులచే దాడులు నిర్వహించి , అక్రమ మట్టి జరుగకుండా చర్యలు తీసుకున్నారు. మళ్లీ ఏడాది నుండి పాషాపూర్ రెవెన్యూ గ్రామాలల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎర్ర మట్టి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగ కోనసాగుతుంది. పాషాపూర్ రెవెన్యూ శివారుల్లోని సర్వే నెంబర్ 41, 42లో రెవెన్యూ అధికారుల అండదండలతో ఎర్ర మట్టి తవ్వకాలు బహిరంగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని రెవెన్యూ, మైన్స్ అధికారులకు తెలసిన ఎందుకు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతేగాకుండా రెవెన్యూ, మైన్స్ అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినట్లు ఆరోపనలు వినబడుతున్నాయి.

**లక్షల్లో వ్యాపారం ...**

పోరుగు రాష్ట్ర వ్యాపారులు పాషాపూర్ - రాంసింగ్ తండాల మధ్యన ఉన్న ఎర్ర రాయి, ఎర్ర మట్టి తవ్వకాలను చేపడుతున్నారు. పెద్ద పెద్ద యంత్రాలను చేపట్టి మట్టితో పాటు ఎర్ర రాయిని తరలిస్తున్నారు. మరి కోంత మంది వ్యాపారస్థులు పాలకులు, అధికారుల అండండలతో ఎర్ర మట్టి వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఇంత జరిగిన ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత నెల రోజుల క్రితం టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేసి ఎర్ర రాయి తరలిస్తున్న ట్రాక్టర్‌లను సీజ్ చేసి కేసులు చేసిన , మల్లి మట్టి తవ్వకాలు మాత్రం జోరందుకున్నాయి. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందిచాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మరి కోంత మంది వ్యాపారస్థులు ముందుగా రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులను పరిచయాలు పెంచుకోంటున్నారు. వారితో కోంత మొత్తం కుదుర్చుకోని మట్టి వ్యాపారం చేస్తున్నట్లు తెలస్తుంది.

**లీజు లేదు ... రాయల్టీ లేదు.**

ప్రభుత్వ భూమితో పాటు , పట్టా భూమిల్లో ఎర్ర మట్టి సుద్ద తవ్వకాలు జరుగాలన్న ప్రభుత్వం నుండి ముందు లీజు పోందాలి. ఆ తరువాత మైన్స్ కార్యాలయం నుండి రాయల్టీలు తీసుకోని మట్టితో పాటు సుద్ద వ్యాపారం చేయవలసి ఉంటుంది. కాని ఏది లేకుండా ప్రస్తుతం ఎర్ర మట్టి, ఎర్ర రాయి తవ్వకాలను కోనసాగుతుంది. దీంతో ప్రభుత్వం ఆదాయంకు పెద్ద ఎత్తున గండి పడుతుంది. ఈ విషయాన్ని మైన్స్, రెవెన్యూ అధికారులకు పిర్యాదులు చేస్తే రెవెన్యూ అధికారులు చుస్తారు ... రెవెన్యూ అధికారులకు పిర్యాదులు చేస్తే మైన్స్ అధికారులు చుస్తారంటు కాలం గడుపుతున్నారు. దీంతో పెద్దేముల్ మండలంలో ఎర్ర మట్టి అక్రమ వ్యాపారం ఆగటం లేదు.

# దశాబ్దాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

▶▶ ఎమ్మెల్యే ప్రత్యేక కృషివల్ల రూ. 26కోట్లతో చేగూర్ నుండి షాద్‌నగర్ డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు

▶▶ మండల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి వివరాలు వెల్లడించిన మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్





నందిగామ, మేజర్‌న్యూస్ (జనవరి 20): దశాబ్ధాల కాలంగా ఇరుకైన రహదారిపై వివిధ గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగసంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ చేగూర్ నుండి షాద్‌నగర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి కృషిచేసినట్లు ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక కృషి వల్ల చేగూర్ నుండి షాద్‌నగర్ వరకు 26కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరుచేసిన డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నట్లు ఆయన వివరించారు. ఈమేరకు మంగళవారం నందిగామలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జంగా నర్సింహులు, సర్పంచ్ మంకాల శ్రీశైలం, పాలకవర్గసభ్యులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపిపి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పరిపూర్ణ అవగాహన కలిగిన ఎమ్మెల్యే వీర్లపల్లి హాయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా షాద్‌నగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాటల మనిషి కాదని, చెప్పింది తక్షణమే అమలు చేసే ప్రజానాయకులని కొనియాడారు. ఈ సందర్భంగా చేగూర్ ఉమ్మడి గ్రామాల నుండి షాద్‌నగర్ వరకు సుమారు 26 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన డబుల్‌రోడ్డు బిటి నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ఎమ్మెల్యే శంకర్ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. గత పదేళ్ల పాలనలో నందిగామ కొత్త మండలంగా ఏర్పడినప్పటికి అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందని, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్‌ప్రభుత్వ హయంలో వందల కోట్ల నిధులతో గ్రామాలలో అభివృద్ధి జరిగి పల్లెల రూపురేఖలు మారుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే ఎమ్మెల్యే వీర్లపల్లి సహకారంతో నూతనంగా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలను నిర్మించి అందుబాటులోకి తెస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి చేగూర్ నుండి షాద్‌నగర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు మంకాల శ్రీశైలం, బుగ్గ సాలయ్య, ఉప సర్పంచ్ ఆవులమంద శివశంకర్, మాజీ ఎంపీటీసీలు దేపల్లె కుమారస్వామి గౌడ్, శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ చారి, నాయకులు బుయ్యని వీరేందర్ గౌడ్, పసుల బుచ్చయ్య, చంద్రశేఖర్, జినుగుంట్ల నవీన్ గౌడ్, పెబ్బే శ్రీశైలం, భాస్కర్ గౌడ్, సతీష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

★ ఇర్విన్ జడ్‌పిహెచ్‌ఎస్‌లో సిఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించిన ఉపసర్పంచ్ దళపతిగౌడ్



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జనవరి 20): విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామపంచాయతి ఉపసర్పంచ్, యువజనకాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షులు గాదెమోని దళపతిగౌడ్ కోరారు. క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులకు సి.ఎం కప్ క్రీడాపోటీలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి పంచాయతి కార్యదర్శి శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, యువతతో కలిసి దళపతిగౌడ్ ముఖ్య అతిధిగా హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరిగింది. విద్యార్థులనుద్దేశించి ఉపసర్పంచ్ దళపతిగౌడ్ మాట్లాడుతూ ప్రతిభకలిగిన క్రీడాకారులకు తమవంతు సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులంతా క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగి విద్యతో పాటు క్రీడారంగంలో రాణించి జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులు, పుట్టిపెరిగిన స్వంత గ్రామాలకు కీర్తిప్రతిష్టలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, నాయకులు బొడ్డుశంకర్,మామిడి శివ, సయ్యద్ సలీం, మాడ్గుల కిరణ్, బాతుక రమేష్, బొలెమోని శ్రీకాంత్, పి.ఈ.టి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పద్మనాభస్వామి భక్తులు తీవ్ర నిరసన






మణికొండ , మేజర్ న్యూస్ (జనవరి 20): మణికొండలోని పుప్పాలగూడ అనంత పద్మనాభ స్వామి ఆలయం, ఖాజాగూడ హెరిటేజ్ రాక్ ఫార్మేషన్ దగ్గర 800 సంవత్సరాల పురాతనమైన గుడిగా విరాజిల్లుతున్న సంగతి అందరికి తెలిసిందే. వైష్ణవ ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహిస్తున్న ఆలయంలో ఇక్కడ ప్రత్యేకించి హుండి ఆదాయం లేకుండా స్థానిక భక్తుల సహాయ సహకారాలతో గుడి నిర్మాణంలో ఉన్న సమయంలో ఎండోమెంట్ ఎక్స్‌గ్యూటివ్ ఆఫిసర్ మాణిక్ ప్రభుతో పాటు ఆంజనే యులు, మోహన్‌రెడ్డి తదితరులు జోక్యం చేసుకుంటున్న విషయం తెలుసుకొని స్థానిక భ క్తులు నిరసన వ్యక్తం చేశారు. అందుకు పరిష్కా రంగా ఎండోమెంట్ అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్ సర్వే అధికారులతో సర్వే చేపట్టి, ఆలయానికి సంబంధించిన స్థలాన్ని కాపాడడానికి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు పాలకవర్గం సత్యనారాయణ, రాజ్‌కుమార్, వేణుగోపాల్, గుట్టమీది నరేందర్, కుమార్‌గౌడ్, బాలరాజు, శ్రీశైలం, చంద్రకాంత్‌గౌడ్, విష్ణేష్, రాజేశ్‌సింగ్ పాల్గొన్నారు.

# పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

-చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల, మేజర్‌న్యూస్(జనవరి 20) : పేదలను సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల పట్టణం, మండలానికి చెందిన వంద మంది లబ్దిదారులకు రూ. 1కోటి11వేల600ల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్దిదారునికి అందిస్తామని తెలిపారు. పేదలు సంతోషంగా ఉండాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల చైర్మెన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ గడ్డమీది పెంటయ్యగౌడ్, బ్యాగరి రాములు, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మర్పల్లి మాలతీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, రావులపల్లి సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ పాండు, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మున్నూర్ జనార్ధన్, నాయకులు రాముగౌడ్, ఎల్లయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

## గత, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులను దగా చేసింది

ఉద్యమ కారుల సమస్యలపై కవితక్కకు కప్పాటి పాండురంగారెడ్డి వినతి



రంగారెడ్డి, మేజర్‌న్యూస్ (జనవరి 20) : తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యమ సమయంలో ఎదర్కొన్న కష్ట,నష్టాలపై తెలంగాణ జాగృతి ఉద్యమకారుల సంక్షేమ కమిటీ గత పది రోజులుగా విస్తృత అధ్యయనం చేసింది. ఈ అధ్యయనంలో రూపొందించిన సమగ్ర నివేదికను సోమవారం నగరంలోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో సంస్త వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత, స్టీరింగ్ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కమిటీ సభ్యులు, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండు రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్‌గౌడ్, ములుగు జిల్లా అధ్యక్షుడు నంగావత్ రాజేష్, శీలం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కప్పాటి పాండు రంగారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ, గతంలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చకుండా వారిని దగా చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కవితక్క చేపట్టే పోరాటానికి రాష్ట్రంలోని ఉద్యమ కారులు, ఉద్యమ సంఘాల సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు.

## ఎం.ఎస్ రెడ్డికి మదర్ థెరిస్సా సేవారత్న పురస్కారం



రంగారెడ్డి, మేజర్ న్యూస్ (జనవరి 20) : ప్రముఖ కంటి పరీక్షల నిపుణుడు, సామాజిక సేవా కార్యకర్త పి. మధుసూదన్‌రెడ్డికి ప్రతిష్టాత్మక మదర్ థెరిస్సా సేవారత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు వైద్యులు గ్లోబల్ ఫౌండేషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కర్మన్‌ఘాట్ రెవెన్యూ శ్రీరమణ కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి మార్మూల ప్రాంతంల్లోని నిరు పేదలకు కంటి పరీక్షలు నిర్వహిచడం, కళ్ల అద్దాలు ఉచితంగా పంపిణీ చేయడం, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రులకు సిఫార్సు చేయడం వంటి సేవలతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఈనెలాఖరులో రవీంద్రభారతి వేదికగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ సేవా రత్నా పురస్కారాన్ని అందించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- విద్యుత్ శాఖ అధికారి నాగరాజు



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (జనవరి 20):** నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ అధికారి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పుట్టపహాడ్ సబ్ స్టేషన్ లో 132కేవీ మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 5గంటల వరకు కుల్కచర్ల మండలంలోని కుల్కచర్ల, పుట్టపహాడ్, అంతారం, బండవెల్లికిచర్ల, ముజాహిద్ పూర్ కామునిపల్లి, ఆయా అనుబంధ గ్రామాలలో విద్యుత్ నిలిపివేయునున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- వార్డు సభ్యురాలు కలకొండ సాలు బాయి అనిల్



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (జనవరి 20):** ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వార్డు సభ్యురాలు కలకొండ.సాలుబాయి అనిల్ అన్నారు.మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని 14వ వార్డు కళ్యాణ్ నగర్ లో గ్రామ పంచాయతీ సిబ్బందితో ఇళ్ళ మధ్య చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని, కాలనీ ప్రజలు ఇళ్ళ మధ్య, రోడ్డు మీద చెత్తను వేయవద్దని సూచించారు. చెత్తను పంచాయతీ ట్రాక్టర్ కు అప్పగించాలని తెలిపారు.

## గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- లాల్ సింగ్ తండా సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (జనవరి 20):** గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని లాల్ సింగ్ తండా సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లాల్ సింగ్ తండాలో వీధిదీపాలను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామభివృద్ధి ద్యేయంగా గ్రామ ముందుకు సాగుతామని అన్నారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మంబాపూర్‌లో ఘనంగా ఊరడమ్మ జాతర

- గ్రామ దేవతకు బోనాలు
- భవిష్యవాణి వినిపించిన ఏర్పులమ్మ
- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు











**పెద్దేముల్,మేజర్ న్యూస్ (జనవరి 20):** మూడు సంవత్సరాలకు ఓ సారి జరిగే ఊరడమ్మ (గ్రామ దేవత) జాతరను మంబాపూర్ గ్రామస్థులు మంగళవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు ... గ్రామాన్ని చల్లంగా చూడాలని ... గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఆర్యోగంగా ఉండాలని ... వర్షాలు సమృద్ధిగా కురువాలని ... పాడి పంటలు అనుకూలంగా పండాలంటూ పెద్దేముల్ మండల మంబాపూర్ గ్రామంలో గ్రామ ప్రజలు గ్రామ దేవత జాతరను ఘనంగా నిర్వహించారు. గడప గడపకు బోనాలతో తరలి వచ్చి అమ్మవారికి నైవేధ్యం సమర్పించి , మొక్కులు తీర్చుకున్నారు.కుల మతం బేదం లేకుండా పండుగల్లో పాల్గోన్నారు. మా గ్రామాన్ని చల్లంగా చుడాలని , పాడి పంటలు సమృద్ధిగా పండాలంటు ఊరడమ్మ ( గ్రామ దేవతకు )గ్రామస్థులు, రైతులు, వ్యాపారస్థులు మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు విన్యాసాలు, ఏర్పులమ్మ భవిష్యవాణీ జాతరలో ప్రత్యేక ఆకర్షణ నిలచింది. మంబాపూర్ గ్రామ ప్రజలు మూడు రోజుల ముందే గ్రామ శివారులో ఉన్న దేవతకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు చేశారు.ప్రతి మూడేళ్లకు ఓ సారి అమ్మవారికి జాతర తీయనున్నట్లు గ్రామ పెద్దలు తెలియచేశారు.మంబాపూర్‌తో పాటు రుక్మాపూర్, పెద్దేముల్, కొండాపూర్, మదనంతపూర్, దుగ్గాపూర్, చైతన్యనగర్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజలు గ్రామ దేవత జాతరల్లో పెద్ద ఎత్తున పాల్గోన్నారు.గ్రామం మొత్తం భక్తి శ్రద్దలతో కదలి పోయింది.

# పదవి లేకున్నా ప్రజాసేవ కొనసాగింపు

- నీటి సమస్యల పరిష్కారానికి సొంత నిధులతో పైపులైన్ పనులు
- పోచారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి




**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 20) :** ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని పోచారం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందులను తెలుసుకుని తక్షణమే స్పందిస్తున్నానని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ, శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి కాలనీ, ఎల్‌ఐజి కాలనీ, మార్కెట్ రోడ్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పైపులైన్ జాయింట్లు దెబ్బతినడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో మాజీ ఛైర్మన్ కొండల్ రెడ్డి వెంటనే స్పందించారు. మంగళవారం సుమారు రూ.20 వేలకుపైగా సొంత నిధులు వెచ్చించి 10 చోట్ల పైపులైన్ జాయింట్లు ఏర్పాటు చేసే పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీ విలీనం అనంతరం మౌలిక సదుపాయాలపై తగిన శ్రద్ధ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య ప్రజలను ఎక్కువగా వేధిస్తోందని, అలాంటి పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాల కోసం నిరంతరం సేవలు కొనసాగిస్తానని కొండల్ రెడ్డి స్పష్టం చేశారు.



## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఇముడాపూర్ సర్పంచ్ వెంకటయ్య

**దౌల్తాబాద్ మేజర్ న్యూస్ (జనవరి 20):** మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కీ హైదరాబాద్ లో కలిసి శాలువాతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఇముడా పూర్ సర్పంచ్ వెంకటయ్య.ఈ కార్యక్రమం లో యంకి మాజీ సర్పంచ్ కాషాప్ప.మాజీ సర్పంచ్ నర్సింలు.యువ నాయకులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని మండలం కేంద్రంగా ప్రకటిస్తు కల్వకుర్తి పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (జనవరి 20) : గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తూ, కల్వకుర్తి పట్టన కేంద్రాన్ని జిల్లా కేంద్రం గా ఏర్పాటు చేయాలని గట్టుఇప్పల పల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గట్టుఇప్పల పల్లి గ్రామంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జోలం వెంకటయ్య మాట్లాడుతూ గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గతంలో అనేక దఫాలుగా రిలే నిరాహార దీక్షలు, వివిధ రకాల నిరసన దీక్ష లు, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి చేసి, పాద యాత్ర ద్వారా స్థానిక తహసీల్ధార్, ఆర్డిఓ, కలెక్టర్ అప్పటి సంబందిత ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీ, జిల్లా మంత్రులు, ఇన్ చార్జ్ మంత్రులు, ముఖ్య మంత్రి వరకు కూడా వెళ్లి విన్న వించినా మా గ్రామానికి మండల కేంద్రము రాలేదని, గత ఎన్నికల్లో ఆమనగల్‌లో బీఆర్ఎస్ కార్య నిర్వాహక అద్యక్షుడు కేటీఆర్, కల్వకుర్తిలో జరిగిన సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అధికారంలోకి వస్తే మండలం ప్రకటిస్తామని తెలియజేసిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ ని ఆశీర్వదించారనిఅన్నారు. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా కసిరెడ్డి నారాయణ్ రెడ్డి, నేడు కాంగ్రెస్ పార్టీ సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో గట్టుఇప్పల పల్లి మండల కేంద్రముగా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు కానీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇచ్చిన హామీని విస్మరించారని వారు అన్నారు. ఈ ప్రాంత వాసి అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తూ, రేవంత్ రెడ్డి సొంత ప్రాంతమైన కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తిరిగి నిరసన దీక్షలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఏదుల రాజు, ఉపాధ్యక్షుడు కానుగుల జంగయ్య, నాయకులు మండల కృష్ణయ్య, శరత్ చంద్ర శర్మ, ఆంజనేయులుగౌడ్, బొల్లి కృష్ణ, కోండల్ వాల్మీకి, ఇట్యాల రవీందర్, జోలం లింగం, ఈదమయ్య గౌడ్‌పాల్గొన్నారు.

# రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి...

## ▶▶ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్

## ▶▶ నాగులపల్లిలో రైతులకు అవగాహణ కార్యక్రమం



ఫరూఖ్‌నగర్,మేజర్‌న్యూస్( జనవరి 20): రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై రైతులకు అవగాహణ కల్పించారు. ప్రతి రైతు తమ పట్టా పాసుబుక్‌తో పాటు ఆధార్‌కార్డు, అదేవిధంగా లింక్ ఉన్న మొబైల్ నంబర్‌లతో సమీప మీసేవా కే ంద్రంలో గాని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద కాని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ కార్యక్రం ద్వారా భూమి ఉన్న ప్రతి రైతు యొక్క వివరాలు ప్రభుత్వ రికార్డులో పొందుపరిచి ఉంటాయని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుని ఎంపిక సులభతరంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పంట గిట్టుబాటు ధర తదితర సంక్షేమ పథకాల లబ్ది చేకూరుతుందని వివరించారు. ప్రతి రైతు త్వరగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధాఅశోక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరి, వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, రైతులు, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండ ప్రత్యేక చర్యలు

– కడ్తాల్ సర్పంచ్ రాయికంటి భిక్షపతి



కడ్తాల్, మేజర్‌న్యూస్ (జనవరి 20): కడ్తాల్ గ్రామపంచాయతి పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ రాయికంటి భిక్షపతి తెలిపారు. గ్రామపంచాయతి 2వ వార్డులో నీటి సమస్య ఉన్నట్లు కాలనీలవాసులు సమస్యను వార్డు సభ్యుడితో పాటు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్ళడంతో మంగళవారం కాలనీలో వారు పర్యటించి నీటి సమస్య పరిష్కారానికి నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేసి పబ్లిక్ కుళాయిని ఏర్పాటు చేయించారు. దీంతో సమస్య పరిష్కారానికి చొరవచూపిన సర్పంచ్, పాలకవర్గసభ్యులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిక్షపతి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎక్కడైనా నీటి సమస్యతోపాటు పారిశుధ్య సమస్యలు ఉంటే గ్రామపంచాయతి పాలకవర్గం దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఅప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, వార్డు సభ్యురాలు నూర్జహాన్ , గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# మణికొండలో క్రికెట్ పోటీలు ప్రారంభం



మణికొండ , మేజర్ న్యూస్ (జనవరి 20)ః మణికొండలోని క్రికెట్ గ్రౌండ్‌లో నవజ్యోతి సంఘం వారి ఆద్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం అయ్యాయి. మణికొండ ప్రిమియర్ 29వ లీగ్ మొత్తం పది టీమ్‌లు రాగా మొదటి మ్యాచ్ రమేష్ వర్సెస్ అరుణ్ పోటీలను ప్రారంభించడం జరిగింది. విన్నర్ టీమ్‌కు పదివేల రూపాయలు, రన్నర్ టీంకు 5000 రూపాయలు పైనల్ చే రిన టీమ్‌లకు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి, బి. రవికాంత్‌రెడ్డి, టి. అంజన్‌కుమార్ గౌడ్, జై. సిద్దప్ప, శ్రీకాంత్‌స్వామి, శివరాంరెడ్డి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నవజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



మణికొండ , మేజర్ న్యూస్ (జనవరి 20)ః ప్రతి సంవత్సరం మాదిరిగా 2026లో కూడా జనవరి 26వ తేది గణతంత్ర దినోత్సవం సందర్భంగా న వజ్యోతి యువజన సంఘం ఆద్వర్యంలో నిర్వహించే క్రికెట్ పోటీలను బి. సాయిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి. రవికాంత్‌రెడ్డి, సి. రాజేందర్‌గౌడ్, బి. శ్రీరాములు, ఎం. రాఘవరెడ్డి, కె.మధుసూధన్‌రెడ్డి, ఎం.సుభాన్‌రెడ్డి, కె. సునీల్‌రెడ్డి, భరత్‌కుమార్, బి. అరవింద్, బి. శివానంద్‌రెడ్డి, అర్. వంశీ, బి. సురేష్, డి.కుమార్, రమేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన రాజు



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జనవరి 20):రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను కలిసిన సామాజిక సంఘకర్త గణాటే రాజు. ఈ మేరకు మంగళవారం రాజు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. సమాజం కోసం తన వంతు కృషి చేస్తున్నానని తమ సహకారం కావాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తమ సహకారం ఎప్పుడు ఉంటుందని తెలిపారు.

# ధర్మ రక్షణ సభను విజయవంతం చేద్దాం

## ▶▶ అందెల శ్రీరాములు యాదవ్ ▶▶ జాగో భాగ్యనగర్... ఛలో బాలాపూర్



మహేశ్వరం,మేజర్‌న్యూస్(జనవరి 20): ధర్మరక్షణ సభను విజయవంతం చేయాలని హిందు బంధువులకు రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో మండల బిజెపి అధ్యక్షులు యదీష్ ఆధ్వర్యంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో, గణేష్ సేన ఈ నెల 24వ తేదీ శనివారం బాలాపూర్‌లో నిర్వహించనున్న ధర్మ రక్షణ సభను విజయవంతం చేయాలని సమావేశం ఏర్పాటు ఈ సమావేశంలో శ్రీరాములు యాదవ్ పాల్గొన్ని మండల నాయకులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క హిందువును జాగృత పరచి శనివారం జరగబోయే ధర్మరక్షణ సభకు వచ్చేలా ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి , జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్ , మాజీ ఎంపీపీ కుండె వెంకటేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటీసీ సభ్యులు సుదర్శన్ యాదవ్, మాజీ అధ్యక్షులు మాధవచారి, మండల ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, బీజేవైఎం నాయకులు దేవేందర్ నాయక్ ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ క్షేత్రాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేస్తాం

–మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం



చేవెళ్ల, మేజర్‌న్యూస్(జనవరి 20) ః మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల పట్టణానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల సీనియర్ నాయకులు కొజ్జెంకి దుర్గాప్రసాద్, కొజ్జెంకి దర్శన్ వారి అనుచరులు బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువనాయకులు డా.మల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్శితులై బీజేపీలో చేరుతున్నారన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే బీజేపీకి ఓట్లు వేస్తారని చెప్పారు. అందరం ఐక్యమత్యంగా పనిచేస్తే గెలుపు తథ్యమన్నారు. పట్టణ కేంద్రాల్లో బీజేపీ బలంగా ఉందని, కార్యకర్తలు, యువకులు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తారన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్గారి రమణారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు పాండురంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

- సర్పంచ్ దాసరి నర్సిములు



**పెద్దేముల్,మేజర్ న్యూస్ (జనవరి 20):** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని పెద్దేముల్ సర్పంచ్ దాసరి చిన్న నర్సిములు అన్నారు.మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలో బస్‌స్టాండ్ నుండి శంభులింగేశ్వర దేవాలయం వరకు ఉన్న పెద్ద మురుగు కాల్వను ఆయన జేసీబీల ద్వార పరిశుభ్రం ప్రారంభం చేశారు. ప్రతి వార్డులో పరిశుభ్రతో పాటు తాగునీరు, వీధిలైట్లు వేయడం జరుగుతుందన్నారు.ఇందుకు గ్రామ పెద్దలు, యువకులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఉదయం సమయంలో మిషన్ భగీరథ నీరు వృధాపోకుండా నల్లాలకు మూతలు వేసుకోవాలని కోరారు. నీరు వృధా పోవడంతో కొంత మందికి తాగునీటి సమస్యలు వస్తున్నాయని, దానిని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దాసరి ప్రసాద్, పెండ్యాల ప్రవీన్‌కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ పొలంలో వ్యక్తిపై దూసుకెళ్లిన ట్రాక్టర్

- వ్యక్తి మృతి.. మృతిపై అనుమానాలున్నాయంటూ ఫిర్యాదు

**కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 20):** వ్యవసాయ పొలంలో వ్యక్తిపై ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొడంగల్ ఎస్సై జీ.వి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. కొడంగల్ మండల పరిధిలోని ఐనన్‌పల్లి గ్రామానికి చెందిన పకీరప్ప (50) మంగళవారం తన అల్లుడు ఆనంద్‌తో కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో కరిగేట పనుల కోసం వెళ్లారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇరుక్కుపోవడంతో బయటకు తీసేందుకు బెల్టు అవసరం ఉండగా మామ పకీరప్ప తీసుకొచ్చాడు. ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో అల్లుడు ఆనంద్ నిర్లక్ష్యం కారణంగా ట్రాక్టర్ పకీరప్పపైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో పకీరప్ప మృతి చెందాడు. పకీరప్ప మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ భార్య రాములమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా





**కొడంగల్, మేజర్ న్యూస్ (జనవరి 20):** పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత అని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా మంగళవారం కొడంగల్ పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో పరిగి, తాండూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులకు, హోంగార్డ్సుకు నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించగా రెండో రోజు మంగళవారం పరిగి, తాండూర్ సబ్ డివిజన్ పరిధిలోని అన్నీ పోలీస్‌స్టేషన్‌ల సిబ్బంది, అధికారులు, హోం గార్డ్స్, వారి కుటుంబ సభ్యుల కోసం వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి ఆరోగ్యం శాఖకు, వారి కుటుంబానికి ఎంతో విలువైందన్నారు. పోలీసుల జీవితం నిత్యం సవాళ్లతో, సమయ భావంతో కూడుకుందన్నారు. ఈ క్రమంలో చాలా మంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, చిన్న చిన్న అనారోగ్య సమస్యలే భవిష్యత్తులో పెద్ద ముప్పుగా మారకముందే ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే కానిస్టేబుల్ నుంచి అధికారి వరకు అందరూ శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటనే ప్రజలకు మరింత మెరుగైన సేవలందించగలరన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లవేళాల ముందు వరుసలో ఉంటామన్నారు. కేవలం జిల్లా కేంద్రానికే పరిమితం కాకుండా అన్నీ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించే సిబ్బందికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలను ఉద్దేశంతో జిల్లా పోలీసు యంత్రాంగం, పోలీసు అసోయేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రముఖ కార్పోరేట్ ఆసుపత్రులైన యశోద, మ్యాక్స్ విషన్, శ్రీ సాయి డెంటల్‌తో పాటు ప్రభుత్వ వైద్య నిపుణులతో పోలీసు అధికారులు, సిబ్బందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు ఈఎన్‌టీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, 2డీ ఎకో, రాండమ్ బ్లడ్ షుగర్, బీపీ, బీయంఐ లాంటి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందుల పంపిణీతో తదుపరి చికిత్సల కోసం స్పెషలిస్టు డాక్టర్‌ల ద్వారా రిఫరల్ సౌకర్యం కల్పించారు. వైద్యులు వెంకటేశ్, సంజయ్ వివేక్, క్రాంతికుమార్, శ్రీనివాస్ తదితరులను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాములునాయక్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రవీందర్‌యాదవ్, పరిగి, తాండూర్ డీఎస్పీలు శ్రీనివాస్, యాదయ్య, పరిగి, కొడంగల్ సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కొడంగల్, తాండూర్, కరణ్‌కోట్ ఎస్సైలు జీ.వీ.సత్యనారాయణ, సంతోష్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, కొడంగల్ ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ చంద్రప్రియ, జిల్లా పోలీసు ప్రసిడెంట్ అశోక్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

★ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20):** మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తు ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండ పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ అన్నారు.మంగళవారము జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నందు మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలు ,ఎన్నికల పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా సమీక్ష నిర్వహించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా సంబంధిత నోడల్ అధికారి అవసరమైన అన్ని మెటీరియల్స్ తో సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలను సీరియస్ గా తీసుకోవాలని, నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుండి లేదా ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్ ,ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతిరోజు నివేదికలు పంపే విధంగా ఎంసిసి నోడల్ అధికారి, అభ్యర్థులు ఖరారు అయిన తర్వాత అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన వివరాలు రిపోర్టులను ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి, బ్యాలెట్ పేపర్లను బ్యాలెట్ అధికారి చూడాలని, రాజకీయ ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విధులు సంబంధిత అధికారి చూడాలన్నారు. ఎక్కడ అలసత్వానికి తావివ్వవద్దని, నోడల్ అధికారులు మరోసారి వారికి కేటాయించిన విధులను పునఃచరణ చేసుకోని ఎన్నికల నియమ ,నిబంధనలను క్షుణ్ణంగా చదివి ఎక్కడ తప్పులు దొర్లకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ , విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, నోడల్ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన దివ్యాంగులకు వివిధ పరికారులు అందజేత

★ మహిళా, పిల్లలు, దివ్యాంగులు మరియు వయో వృద్ధుల శాఖ జిల్లా అధికారి బి. కృష్ణవేణి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా, పిల్లలు, దివ్యాంగుల మరియు వయోవృద్ధులు శాఖ మరియు తెలంగాణా దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శారీరక దివ్యాంగులకు, అంధులకు, మరియు బధిరులకు బ్యాటరీ వీల్ చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, లాప్ టాప్స్ (డిగ్రీ విద్యార్థులకు) టాబ్స్, హియరింగ్ ఎయిడ్స్ ఉచితంగా పంపిణీ చేయుటకు నిర్ణయించడమైనదని మహిళా, పిల్లలు, దివ్యాంగులు మరియు వయో వృద్ధుల శాఖ జిల్లా అధికారి బి. కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులు https://tgobmms.cgg. gov.in అను వెబ్ సైట్ నందు తేదీ 30.01.2026 లోపు అన్ని ధ్రువపత్రాలతో ఆన్ లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకొనే అవకాశం కలదన్నారు. దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి నియమ నిబంధనల మేరకు అర్హత గల దివ్యాంగులను ఎంపిక చేస్తారనితెలిపారు. అర్హతలు మరియు నిబంధనల కొరకు Online Beneficiary Management & Monitoring System (OBMMS)వెబ్సైట్ ను సందర్శించాలన్నారు.

# ప్రశాంత వాతావరణంలో రంజాన్ మాసం నిర్వహించుకోవాలి : జిల్లా ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజేశ్వరి



వికారాబాద్‌జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (జనవరి 20)ః ప్రశాంత వాతావరణంలో పవిత్ర రంజాన్ మాసం నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇంచార్జి జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారము కల్లెక్ట్రేట్ కార్యాలయము అదనపు కలెక్టర్ చాంబర్ లో రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ఫిబ్రవరి 18 నుంచి ప్రారంభమవుతున్నందున జిల్లాలో ఉన్న ప్రతీ మసీద్, ఈద్గాలలో త్రాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్ సరఫరా,వీధి లైట్లు, తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలోని ప్రార్థనా స్థలాల పరిసరాలలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, త్రాగు నీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.రంజాన్ పర్వదినం రోజు ప్రార్ధనా స్థలాల్లో మెడికల్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని డి.యం.హెచ్.ఓ కు ఆదేశించారు. ఎక్కడ కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. రంజాన్ మాసం ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముస్లిం ప్రతినిధులకు సూచించారు.సమావేశం లో వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణ కుమారి, డి ఎస్ ఓ సుదర్శన్, తహసిల్దార్లు, తాండూర్, పరిగి, వికారాబాద్, కోడంగల్ మున్సిపల్ కమిషనర్ లు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యానవన పంటల సాగుపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి

## రైతులు అధిక దిగబడులు పొంది ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్







వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20)ః ఉద్యానవన పంటల సాగుపై పూర్తిగా అవగాహన పెంచుకొని అధిక దిగబడులతో ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులకు సూచించారు. వికారాబాద్ మండలం ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో మంగళవారం ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో ఉద్యానవన శాఖ అధికారులు, వివిధ బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... ఉద్యానవన పంటలను నాణ్యతతో పండించినట్లయితే అధిక లాభాలను ఆశించ పచ్చున్నారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుందని, అలాంటి వివరాలను సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఉద్యానవన పంటలను పండిస్తున్న రైతుల సమస్యలను తెలుసుకోవడానికి అదేవిధంగా రైతుల సూచనలను పరిగణలోకి తీసుకొని రైతులకు కావలసిన అవసరాలు తెలుసుకునేందుకు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూలు, కూరగాయలు, పండ్ల తోటల సాగుతో పాటు ఆయిల్ ఫామ్ పంటలు వేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. రైతులు వివిధ పంటలు వేసిన క్రమంలో అధిక దిగుబడును రావడానికి వ్యవసాయ శాస్త్రజ్ఞులచే శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. చిన్న సన్నకారు రైతులను కూడా గుర్తించి సబ్సిడీలు అందజేసి ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే నర్సరీల ఏర్పాటుకు సబ్సి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ స్థలానికి కేటాయించలేని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మార్కెటింగ్, రైతు బజార్ సమస్యలను పరిష్కరిస్తానని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులకు నాణ్యమైన వంగడాలు అందించేలా అదేవిధంగా ఏ ఏ సమయాల్లో పంటలకు ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడి అధిక దిగుబడులు పొందే విధంగా ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కొత్త గడి, ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఉద్యానవన పంటలను అధికారులు, రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా వికారాబాద్ లో గల పట్టుదార పరిశ్రమ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, సర్పంచులు సయ్యద్ రబ్బాన్, బిల్లపాటి విజయలక్ష్మి, పట్టు పరిశ్రమ ఏడి నాగరత్న, ఉద్యానవన అధికారులు కమల, డాక్టర్ సురేంద్రనాథ్, యమున లు పాల్గొన్నారు.

# సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా సంక్షేమాధికారి శ్రీలత



రంగారెడ్డి, మేజర్ న్యూస్ (జనవరి 20) : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారిత కోసం అమలు చేస్తున్న పథకాల్లో భాగంగా సహాయ ఉపకరణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి శ్రీలత తెలిపారు. దివ్యాంగులకు బ్యాటరీ వీల్‌చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్ (ఎంపవర్ కార్ట్), హైబ్రిడ్ వీల్‌చైర్ అటాచ్‌మెంట్‌తో కూడి వీల్ చైర్స్, డిగ్రీ విద్యార్థులకు ల్యాప్‌టాప్స్, ఉన్నత విద్య/సాంకేతిక విద్య విద్యార్థులకు ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తులు అందకపోవడం వల్ల పూర్తి స్థాయిలో లక్ష్యాలు చేరుకోలేకపోయినట్లు, ప్రస్తుతం ఓబిఎంఎంఎస్ పోర్టల్‌ను తిరిగి చెరిచి దరఖాస్తులు స్వీకచించనున్నట్లు చెప్పారు. అర్హులైన దివ్యాంగులు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈనెల 21 నుంచి 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

# సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ




రంగారెడ్డి, మేజర్ న్యూస్ (జనవరి 20) : సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ (ఎజీటీయు) జిల్లా క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిటీయు జిల్లా అధ్యక్షుడు డి. గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, యూనియన్ నాయకులు బాలరాజు, రవికాంత్‌రెడ్డి, వెంకటలక్ష్మి, లక్ష్మి, వాణి, కవిత హాజరయ్యారు.

# ఉపాధి హామి చట్టం పరిరక్షణకు ఉద్యమం

▶▶ 'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలి ▶▶ పాద పద్దతిలోనే ఉపాధిహామి పథకం కొనసాగించాలి ▶▶ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి





చేవెళ్ల, మేజర్‌న్యూస్ (జనవరి 20) ః పేదల ఉపాధికి నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తిలేదని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి హెచ్చరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దరించాలంటూ టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మీనాక్షి నటరాజన్ పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ పామెన భీంభరత్ ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో నిరసన చేపట్టి ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదల కోసం ప్రవేశపెట్టిందని, ఆ పథకం చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడవాలని చూస్తుందన్నారు. ఉపాధిని నిర్వీర్యం చేస్తే కుట్రలు ఆపాలని లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి వీబీజీ రామ్‌జీ పేరు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ పనికి ఆహారం పథకం కింద ఆనాడు ప్రధాని మన్మోహన్‌సింగ్ చేవెళ్ల మండలం ఆలూర్‌లో ప్రారంభించారని ఈసందర్భంగా గుర్తు చేశారు. గాంధీ పేరు ఉందని ప్రధాని మోడీ పేరును తొలగించి వీబీజీ రామ్‌జీ పేరు పెట్టడం జరిగిందన్నారు. గ్రామాలు అభివృద్ధి జరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని గాంధీ అన్న మాటలను ఆ పథకానికి పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పనులు దొరకాక పట్టణాలకు వలస వెళ్తున్నారని గుర్తించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకం తీసుకొచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి గాంధీ అనే పదం ఉండొద్దనే దురుద్దేశ్యంతో పేరు తొలగించారని మండిపడ్డారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పెట్టిన చోటే బీజేపీ ప్రభుత్వాన్ని బొంద పెట్టాలన్నారు. స్వార్ధం కోసం పెట్టిన పథకం కాదని, పేదలందరికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో తీసుకొచ్చారన్నారు. భగవంతుని పేరు పెట్టాలనుకుంటే కొత్త పథకం, కొత్త చట్టం తేవాలని సూచించారు. మోడీ ప్రభుత్వం పేదలను మోసం చేయాలని చూస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించి నిరసన చేపట్టాలని సూచించారు. వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని ఆయనడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మెన్ బొర్ర జ్ఞానేశ్వర్, రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వేణుగౌడ్, రాష్ట్ర పొలూష్యన్ బోర్డు మెంబర్ చింపుల సత్యానారాయణరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ముడిమ్యాల సొసైటి మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మెన్ పెంటయ్యగౌడ్, మండల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, రాచమల్ల సిద్దేశ్వర్, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జనార్ధన్, నాయకులు మాణిక్యం, పెంటారెడ్డి, చెన్నయ్య, పడాల రాములు తదితరులు ఉన్నారు.

# మైనారిటీ రెసిడెన్సియల్ విద్యా సంస్థలలో ఆన్లైన్ దరఖాస్తు నమోదుకై వెబ్సైట్ ప్రారంభం

★ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, మేజర్ న్యూస్ (జనవరి 20):** వికారాబాద్ జిల్లాలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ విద్యా సంస్థ లలో విద్యాను అభ్యసించేందుకు ఆన్లైన్ దరఖాస్తు నమోదుకై వెబ్సైటు ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నందు రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెబ్ సైట్ ను ప్రారంభిస్తూ కలెక్టర్ మాట్లాడుతూ... టిజిఎంఆర్ఇఐఎస్ పాఠశాల ల్లో మరియు కళాశాలలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఐదవ తరగతి, మరియు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు తమ పేర్లను ఈ వెబ్ సైట్ జరుఖ్టుజీట్టుజ్ఞ్చుజ్ఞ్చు. ఛిజజ. జౌ౨. ఖ నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్ని ఆధునిక మౌలిక వసతులతో పాటు ఐఐఖీ, ఒఉఉ, ౣఉఉఖీ, ఉఽఇఉఖీ, ఇఔఅఖీ, ్ఖఖిఇ, ౣఈఅ వంటి పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ, మైనార్టీతర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ తో పాటు జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుధీర్, అకాడమీ కో ఆర్డినేటర్ జహీర్, మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమ, తాండూర్ ప్రిన్సిపాల్ వినోద్ ఖన్నా, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథల చిరునవ్వులే నా పుట్టినరోజు కానుక

★ ఆర్భాటాలకు కాదు సేవకే ప్రాధాన్యం – పోచారం ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాసం అమర్నాథ్ రెడ్డి



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 20) :** సమాజంలో ఉన్న అనాథలు, పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పోచారం ఐటి కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నెక్స్ట్ జెన్ గ్రూప్ ఆఫ్ హాస్టల్స్ వ్యవస్థాపకుడు పాసం అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్భాటాలకు దూరంగా సేవాభావంతో కార్యక్రమాలు చేపట్టినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉన్న అగాపే అనాథ ఆశ్రమంలో మంగళవారం ఐటి కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమర్నాథ్ రెడ్డి తన జన్మదిన వేడుకలను అనాథ విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు విద్యాసామగ్రి, ఆటవస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజులు, శుభకార్యాలను ఆర్భాటంగా జరపడం కంటే అవసరమైన వారికి ఉపయోగపడేలా జరపడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని అన్నారు. అనాథలు, పేదలకు అండగా నిలిచే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటి కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

★ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (జనవరి 20):** పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామానికి చెందిన వడ్ల రమేష్, టి.రాజు తదితరులకు సిఎం సహాయ నిధి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రాణపాయ స్థితిలో ఉన్న నిరుపేదల ప్రాణాలను కాపాడేందు తెలంగాణ సర్కార్ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. స్థోమతలేక వివిధ అనారోగ్యాలతో బాధపడుతూ వైద్య సేవలకు నోచుకోని నిరుపేదలకు సీఎంరిలీఫ్‌ఫండ్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, భీమయ్య, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**బొంరాస్‌పేట్, మేజర్‌న్యూస్ (జనవరి 20):** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, దుప్‌చర్ల సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పట్నం నరేందర్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో అన్నీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఆహర్నిషలు కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యేగా కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలు చురగొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించి గులాబీ జెండాను ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రావణ్‌గౌడ్, అనంత్‌గౌడ్, మహేందర్, సలీం, నిరంజన్, మాజీ ఎంపీటీసీ నరసింహా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

★ పెద్దేముల్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీ ధీప్తి





**పెద్దేముల్,మేజర్ న్యూస్ (జనవరి 20):** తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ – పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో పాడి పశువుల ఉచిత శిభిరాలను ప్రతి రైతు సద్వినియోగం ,చేసుకోవాలని పెద్దేముల్ పశువైధ్యాధికారి డాక్టర్ శ్రీ ధీప్తి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల జనగాం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైధ్య కార్యక్రమంలో డాక్టర్ ధీప్తి మాట్లాడుతూ పాడి పశువులు వ్యాధిన భారిన పడకుండా చూసుకోవాలని రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఉచిత వైధ్య శిభిరంలో చూడి పరీక్షలు, దుడలకు నట్టల మందులు వేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ఉచిత వైధ్య క్యాంపులు నిర్వమించడం జరుగుతుందనిఒ, ఇందుకు రైతులు కూడ సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న ఆనంతయ్య, ఉప సర్పంచ్ అనురాధ సంజీవ్ కుమార్, వీయల్ఓ కృష్ణమూర్తి యల్ఎస్ఏ శేఖర్, గోపాల మిత్ర సూవర్ వైజర్ కేశవులు, గోపాల మిత్రలు నరేందర్, బంద్యయ్య, శివప్రసాద్, శేఖర్, రవి, సిద్దిక్‌తో పాటు గ్రామ రైతులు తదితరులు పాల్గోన్నారు.

# ఉచిత ఉజ్వల గ్యాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

★ ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసిన హెచ్.పీ గ్యాస్ డీలర్ జి. విష్ణువర్ధన్ రెడ్డి



**దోమ, మేజర్ న్యూస్ (జనవరి 20):** ఉచిత ఉజ్వల గ్యాస్ యోజన పథకంను సద్వినియోగం చేసుకోవాలని హెచ్.పీ గ్యాస్ డీలర్ జి.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని శ్రీ దత్త సాయి హెచ్పీ గ్యాస్ డీలర్ జి విష్ణువర్ధన్ రెడ్డి ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత పథకంలో లబ్ధి పొందిన వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లును, గ్యాస్ పొయ్యిని అందజేసారు. అదేవిధంగా వారు మాట్లాడుతూ... దోమ మండల పరిధిలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇస్తున్నటువంటి ఈ పథకం కింద సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం గురించిమరియు గ్యాస్ ను ఏ విధంగా వాడాలో లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తదితరులు పాలుగోన్నారు.

# భక్తి శ్రద్ధలతో శివ పూజ



**దోమ, మేజర్ న్యూస్ (జనవరి 20):** దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో శివస్వాములు శివపూజను భక్తి శ్రద్ధలతో చేశారు. మంగళ వారం బొంపల్లి గ్రామంలోని శివాలయంలో గ్రామానికి చెందిన శివ స్వాములు శివ పూజను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ వార్డు సభ్యుడు కొనగాళ్ల నర్సింలు శివ స్వాములకు భిక్షను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శివస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై నోటీసులతో సరి చర్యలు ఎక్కడ మరి

**-నోటీసులతో సరి.... చర్యలు ఎక్కడ మరి....? - అధికారుల హెచ్చరికలను తుంగలో తొక్కుతున్న అక్రమ నిర్మాణ దారులు, సర్కిల్ ఆదాయానికి భారీగా గండి -నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న సర్కిల్ అధికారులు**








తుర్కయంజాల్, మేజర్ న్యూస్, ( జనవరి 20 ) :ఆదిభట్ల సర్కిల్లోని తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ ల పరిధిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్, తుర్కయంజాల్ డివిజన్ లో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున నిర్మించడంతో సర్కిల్ ఆదాయానికి భారీగా గండి పడుతుందని స్థానికులో పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.డివిజన్ లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీ స్థాయిలో కమర్శియల్ షెడ్డు నిర్మాణాలు కొనసాగిస్తున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.తొర్రూర్ డివిజన్ పరిధిలోని సైబర్ సిటీలో నిర్మిస్తున్న భారీ షెడ్డు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించిన సర్కిల్ అధికారులు నిర్మాణ పనులను నిలివేసి ప్రభుత్వ అనుమతులతో నిర్మాణ పనులు కొనసాగించుకోవాలని అధికారులు పల్ మార్లు నిర్మాణాదారులను హేచ్చరించారు.అయినా అధికారుల హెచ్చరికలను ఉల్లంగిస్తూ ఆ అక్రమ షెడ్డు నిర్మాణ పనులను పూర్తిగా కొనసాగించుకుంటూ రావడంతో అధికారులు నిర్మాణాదారులకు మరోమారు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. అధికారుల హెచ్చరిక నోటీసులను పెడ చెవిన పెట్టిన సదరు నిర్మాణాదారులు యధావిధిగా నిర్మాణాలు కొనసాగించడంతో స్థానికంగా నోటీసుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం సదరు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణాదారులు విచ్చలవిడిగా రెచ్చి పోయి నిర్మాణాలు చేపడుతున్నారు.అక్రమ నిర్మాణలో జారీ చేస్తున్న అధికారుల నోటీసులు అభాసుపాలవుతున్నాయి.సర్కిల్ డిప్యూటీ కమీషనర్ కానీ, టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ, కిందిస్థాయి సిబ్బంది అక్రమ నిర్మాణాలు జరిగే చోటుకి వెళ్లి అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు యాజమానులకు నోటీసులు ఇచ్చి వెళ్లగానే యజమానులు నోటీసులను పక్కన పడేసి నిర్మాణాలను కొనసాగించారు.ఎన్నో అక్రమ నిర్మాణాలకు,వందలాది నోటీసులు ఇచ్చినా ఫలితం శూన్యమని స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు గుప్పుమంటున్నాయి.దీన్ని బట్టి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ పరిధిలో అధికారుల పర్యవేక్షణ తూ తూ మంత్రంగా జరుగుతుందని పలువురు మండిపడ్తున్నారు.వెంటనే జోనల్ కమీషనర్, జిల్లా కలెక్టరు లు స్పందించి అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని, సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకొని సర్కిల్ అభివృద్ధికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

# ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరు ఛలో బాలాపూర్

**జల్ పల్లి, శ్రీరామ కాలనీ ప్రజలకు పిలుపునిచ్చిన అందేలా శ్రీరాములు**



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జనవరి 20):ధర్మ రక్షణ కొరకు భాగ్యనగర్ లో ఉన్న ప్రతి ఒక్కరు ఈనెల 24న శనివారం బాలాపూర్ గణేష్ చౌక్ వద్ద రోహింగ్యాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందేలా శ్రీరాములు యాదవ్ జల్ పల్లి, శ్రీరామ కాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జల్ పల్లి మాజీ ఎంపీటీసీ కపిల్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రశాంతి శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు గొరిగే మల్లేష్, గణపతి చించోలే, జల్ పల్లి బిజెపి అధ్యక్షులు మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి, బీజేవైఎం కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో అందేలా శ్రీరాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.బంగ్లాదేశ్, బర్మా దేశాల నుండి అక్రమంగా వలస వచ్చి బాలాపూర్ లో నివాసముంటున్న రోహింగ్యాలను తిరిగి వారి దేశాలకు పంపించేదాకా ప్రతి ఒక్కరు ఏకమవ్వాలన్నారు. ఈనెల 24న శనివారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో బాలాపూర్ గణేష్ చౌక్ వద్ద నిర్వహించే ధర్మ రక్షణ సభను విజయవంతం చేయాలన్నారు. దేశంలో అక్రమ రోహింగ్యాల చొరబాటుతో స్థానిక ముస్లింలు కూడా ఉపాధి కోల్పోతున్నారని, ఇది మతాల మధ్య పోరాటం కాదని, దేశ భద్రత కోసం ప్రారంభమైన ఉద్యమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ బిజెపి అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జల్ పల్లి బిజెపి, బీజేవైఎం కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ సర్కిల్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

**రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా ప్రజలకు జీహెచ్ఎంసీ హెచ్చరిక**



బాలాపూర్, మేజర్ న్యూస్ (జనవరి 20):జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ త్రిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించారు. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని 57వ డివిజన్ నుంచి 62వ డివిజన్ వరకు అన్ని కాలనీల్లో ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో భాగంగా తడిపొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలని ప్రజలకు స్పష్టంగా సూచించారు. రోడ్డుపై చెత్త వేస్తున్న వారికి జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జనలు చేయరాదని హెచ్చరిస్తూ, రెడ్యూస్ ర్యూస్ రిసైకిల్ విధానాలపై అవగాహన కల్పించారు.చెత్త వేస్తే చర్యలు తప్పవు డ్రైవ్‌లో భాగంగా దుర్గ లక్కీ మార్ట్ వద్ద బహిరంగ ప్రదేశంలో చెత్త వేస్తూ అపరిశుభ్రం చేస్తున్న వ్యక్తికి పెనాల్టీ విధించారు. అలాగే బాలాపూర్ చౌరస్తా బాక్స్ క్రికెట్ ప్రాంతంలో చెత్త వేసి కాల్చిన ఘటనపై సంబంధిత వ్యక్తికి జరిమానా విధించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూ ఎం అభినయ్ కుమార్, ఏఈ గంగా ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వి. యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ ఎం. నరసింహ, పర్యావరణ ఇంజనీర్ రాము, సర్కిల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హరీష్ రావుకు సంఘీభావం..తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ శక్తి ప్రదర్శన

**సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ కక్షసాధింపులు: ఎం ఎం సీ కామేష్ రెడ్డి**



బాలాపూర్, మేజర్ న్యూస్ (జనవరి 20):కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు టి. హరీష్ రావు హాజరవుతున్న నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన నేతలు కలుసుకున్నారు.మహేశ్వరం ముద్దుబిడ్డ, సబితమ్మ నమ్మిన బంటు అనుచరుడు మీర్ పేట్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. జై హరీష్ రావు నినాదాలతో భవన్ ప్రాంగణం మార్మోగిందన్నారు.

లొట్టపీస్ కేసులో హరీష్ రావుకు సంబంధం లేదనీ ఈ సందర్భంగా కామేష్ రెడ్డి మాట్లాడుతూ.. లొట్టపీస్ కేసులో హరీష్ రావుకు ఎలాంటి సంబంధం లేదని కోర్టులే స్పష్టం చేసిన తర్వాత మళ్లీ నోటీసులు ఇవ్వడం, విచారణకు పిలవడం రాజకీయ కక్షసాధింపులే అని మండిపడ్డారు. ఇది న్యాయానికి విరుద్ధమని, కాంగ్రెస్ ప్రభుత్వ "రాక్షసానందం"గా అభివర్ణించారు.

అక్రమాల్ని బయట పెడుతున్నందుకే నోటీసులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాలను ప్రజల ముందుకు తెస్తున్నందుకే బీఆర్ఎస్ నాయకులపై వరుసగా అక్రమ కేసులు, నోటీసులు ఇస్తున్నారని, ఆరోపించారు. రేవంత్ రెడ్డి, ఆయన బంధువులు, కాంగ్రెస్ మంత్రుల అక్రమాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను వేధించడం అలవాటుగా మారిందన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకూ పోరాటం ఆగదు, మీరు ఎన్ని రాజకీయ కక్షలు చేసినా, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకూ బీఆర్ఎస్ పోరాటం ఆపదు. మీ ప్రతీకార రాజకీయాలకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు సిద్ధం సమ్మక్కసారక్క, భద్రకాళి అమ్మవారి మీద ప్రమాణం చేసి మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కామేష్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# క్రీడల పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం

**గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి : సర్పంచ్ కటికల శేఖర్‌యాదవ్**



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (జనవరి 20) : ఒక క్రీడాకారుడు ఉన్నతమైన స్థాయికి వెళ్లాలంటే అతనిలో ప్రతిభ ఉండాలి. ఒక కుటుంబం బాధ్యత ఎలా ఉంటుందో మ్యాచ్‌లో విజయం సాధించడానికి అదే బాధ్యత ఉండాలని, పట్టుదల సమయస్ఫూర్తి, జట్టులో కోఆర్డినేషన్, ఉండాలని తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్‌యాదవ్ అన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ ఉప్పల వెంకటేష్ సౌజన్యంతో తకొండపల్లి గ్రామ సర్పంచ్ కటికల శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టిపిఎల్ 4 సిజన్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం సాయంత్రం(విన్నింగ్ షీల్డ్) బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ క్రీడల పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, యువతకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తా అన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను చూపి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలో రాణించాలని ఆకాంక్షించారు. నేటి తరం యువత చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రిడారంగంలో రాణించాలని, క్రీడలతో యువకులలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని శేఖర్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్‌యాదవ్, ఉప సర్పంచ్ కోటీశ్వర్‌ముదిరాజ్, నాయకులు పాండుయాదవ్, రోయ్యల యాదయ్యముదిరాజ్, యాదయ్య, కుమార్, మల్లేష్, నరేష్‌ముదిరాజ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రానించే విధంగా జేకేఏ కృషి





**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 20):** అంతర్జాతీయ స్థాయిలో కరాటే క్రీడాకారులు రానించే విధంగా ఉత్తమ శిక్షణ అందించేస్తున్నామని జపాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ షిహన్ రాపోలు సుదర్శన్, ఆల్ ఇండియా ఛీఫ్ షిహన్ ఆనంద్ రత్న, తెలంగాణ బోర్డు ఆఫ్ డైరెక్టర్, మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ గుగులోత్ గోవింద్ నాయక్ అన్నారు. 43వ జేకేఏ జాతీయ కరాటే ఛాంపియన్షిప్ అస్సాం రాష్ట్రం గౌహతిలో జనవరి 16 నుండి 20 వరకు జరిగిన ఛాంపియన్షిప్ పోటీలలో తెలంగాణ తరుపున మేడ్చల్ మల్కాజిగిరి స్పోర్ట్స్ కరాటే అకాడమికి చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ చూపి మెడల్స్ సాధించిన విద్యార్థులను వారు మంగళవారం అభినందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలోని స్పోర్ట్స్ అకాడమికి చెందిన అండర్ 10 బాలికల విభాగం ఎస్.గాయత్రి కటాలో సిల్వర్ మెడల్, కుమితేలో బ్రాంజ్ మెండల్ సాధించారు. అండర్ 12 బాయ్స్ బ్లాక్ బెల్ట్ విభాగంలో ఆకాష్ కుమార్, కటాలో సిల్వర్ మెడల్, అండర్ 14 బాలికల బ్లాక్ బెల్ట్ విభాగంలో నక్క లక్ష్మీ, సుజనా ప్రియా, కుమితే బ్రాంజ్ మెడల్ ఇలా క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభచూపి మెడల్స్ సాధించడం గర్వంగా ఉందని అన్నారు. ఈ కరాటే విద్యను అన్ని వర్గాల విద్యార్థులకు అందించే విధంగా అసోసియేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

★ 8 తులాల బంగారం, 50 తులాల వెండి, 3 సెల్ ఫోన్లు స్వాదీనం

★ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా





**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20):** వికారాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా అమాయక మహిళలే లక్ష్యంగా చేసుకొని, వారి దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న ముగ్గురు పాత నేరస్తుల ముఠాను జిల్లా సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా తెలిపారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పి కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని ధారూర్, వికారాబాద్ టౌన్ మరియు పరిగి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా మహిళలను మోసం చేసి బంగారం దొంగిలించిన ఘటనలు నమోదు కావడంతో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఈ కేసులను సీరియస్‌గా పరిగణించారు. నిందితులను తక్షణమే పట్టుకోవాలని జిల్లా సిసిఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఆధ్వర్యంలోని బృందం రంగంలోకి దిగింది. సీసీటీవీ ఫుటేజీలు, టెక్నికల్ ఆధారాలు మరియు నేరం జరిగిన తీరును విశ్లేషించి, పక్కా సమాచారంతో ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేయబడిన వేముల లక్ష్మి (బాలానగర్), చెల్ల నర్సమ్మ (రాజేంద్రనగర్), బండారి అనిత (సనత్‌నగర్) వీరు నారాయణపేట జిల్లాలోని మద్దూర్, కోస్గి మరియు నరననపేట టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ, గతంలో సైబరాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, రాచకొండ మరియు జగిత్యాల జిల్లాల్లో సుమారు 28 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వీరి వద్ద మొత్తం 1). 8 తులాల 8 గ్రాముల బంగారము, 2). 50 తులాల వెండి. 3). మూడు (3) సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

## కోర్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

★ ఉపాధి కల్పన అధికారిణి రాధిక

★ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెషన్స్ కోర్టులో ఒప్పంద నియామకాలు



**మేడ్చల్ జిల్లా,ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20):** తెలంగాణ రాష్ట్ర న్యాయశాఖ పరిధిలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన జిల్లా సెషన్స్ న్యాయమూర్తి కార్యాలయంలో ఖాళీగా ఉన్న కొన్ని పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం యం. రాధిక సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భర్తీ ప్రక్రియలో సీనియర్ సూపరింటెండెంట్ (హెడ్ క్లర్క్) పోస్టు ఒకటి ఖాళీగా ఉందని, దీనికి నెలకు రూ.40,000 గౌరవ వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఒకటి ఖాళీగా ఉండి, దీనికి నెలకు రూ.19,500 గౌరవ వేతనం అందజేస్తారన్నారు. సీనియర్ సూపరింటెండెంట్ పోస్టుకు అర్హులైన పదవీ విరమణ పొందిన న్యాయశాఖ మినిస్టీరియల్ సిబ్బంది అందుబాటులో లేకపోతే, బయటి అభ్యర్థులను కూడా పరిశీలిస్తామని తెలిపారు. బయటి అభ్యర్థులు 2026 జనవరి 1 నాటికి కనీసం 18 సంవత్సరాలు పూర్తి చేసి, గరిష్టంగా 34 సంవత్సరాలు మించకుండా ఉండాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపు వర్తిస్తుందని వెల్లడించారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దేశంలోని ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, అలాగే కంప్యూటర్ ఆపరేషన్‌పై పరిజ్ఞానం లేదా అర్హత కలిగి ఉండాలని తెలిపారు. బయట నుంచి 20 మందికి మించి దరఖాస్తులు వచ్చిన పక్షంలో, అర్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి, అర్హులైన వారికి మౌఖిక ఇంటర్వ్యూ నిర్వహిస్తారని పేర్కొన్నారు.అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, జనన ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం (ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు), ఉపాధి నమోదు కార్డు, లోకల్/నాన్-లోకల్ సర్టిఫికెట్ (1975 ఉత్తర్వుల ప్రకారం)తో పాటు రూ.30 విలువ గల స్వయంగా చిరునామా వ్రాసిన రిజిస్టర్డ్ పోస్టల్ కవర్ జతచేయాల్సి ఉంటుందని తెలిపారు.అర్హతలు, వయో పరిమితి, విద్యార్హతలు, ఇతర నిబంధనలు, దరఖాస్తు విధానం వంటి పూర్తి వివరాలు సంబంధిత నోటిఫికేషన్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. దరఖాస్తులు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చిరునామాకు మాత్రమే పంపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారిణి యం. రాధిక సూచించారు.

## కిష్టాపూర్‌లో సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన

★ త్వరిత పరిష్కారానికి చర్యలు

★ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20):** మేడ్చల్ పరిధిలోని పూడూర్ కిష్టాపూర్ డివిజన్‌లో మంగళవారం మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ సర్కిల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. కిష్టాపూర్‌లో నెలకొన్న పలు సమస్యలను స్థానిక నాయకులు, కాలనీవాసులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. సంబంధిత అంశాలపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సర్కిల్ అధికారులను ఆయన ఆదేశించారు.కిష్టాపూర్‌లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న డిప్యూటీ కమిషనర్ సుధాంశ్‌కు స్థానిక నాయకులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ త్రిసభ్య కమిటీ సభ్యులు రెడ్డెం గారి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, పూడూర్ సొసైటీ డైరెక్టర్ వేముల సత్యనారాయణ రెడ్డి, యాదగిరి, పరుశురాం, అర్చనా కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుచ్చి రాములు, కాలనీవాసులు కమలాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గంగయ్య, హనుమంత రెడ్డి, రంజిత్ రెడ్డి, మేడ్చల్ సర్కిల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

★ హెచ్‌ఎండబ్ల్యుఎస్ ఎండికి వినతి



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (జనవరి 20):** రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నీటి వినియోగం బిల్లులు తగ్గించాలని కోరుతూ హెచ్‌ఎండబ్ల్యుఎస్ ఎండి అశోక్ రెడ్డిని మంగళవారం పోచారం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి కలసి వినతి పత్రం అందించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఇస్మాయిల్ ఖాన్ గూడ, యంనంపేట్ గ్రామాలకు నీటి సరఫర చేసే విధంగా కృషి చేయాలని, కృష్ణ నీళ్ళు, బోరు నీళ్ళు కలిపి ఇస్తున్నందున్న ప్రజలకు బిల్లులు తగ్గించే విధంగా చూడాలని కోరుతూ ఖైరతాబాద్ లోని హెచ్‌ఎండబ్ల్యుఎస్ కార్యలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలసి వినతి పత్రం అందించినట్లు, దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కొండల్ రెడ్డి తెలిపారు.

## 6 నమూనా సేకరణ వాహనాల కొరకు టెండర్లు ఆహ్వానం

★ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి. స్వర్ణకుమారి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జనవరి 20):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వికారాబాద్ ఆధ్వర్యంలో (టి- డయాగ్నోస్టిక్ నమూనా సేకరణ వాహనాలు) కార్యక్రమం నిమిత్తం, ప్రభుత్వ ఆరోగ్య సంస్థల నుండి ల్యాబొరేటరీ పరీక్షల కోసం నమూనాల సేకరణ మరియు రవాణా చేయుటకు అవసరమైన నమూనా సేకరణ వాహనాలు (06)ను అద్దె ప్రాతిపదికన ఏజెన్సీల నుండి సంక్షిప్త టెండర్లు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారి డి. స్వర్ణకుమారి పేర్కొన్నారు. ఈ టెండర్ ప్రక్రియ (టి- డయాగ్నోస్టిక్ నమూనా సేకరణ వాహనాలు) తేదీ: 22.01.2026 నుండి 02.02.2026. 05.00 సాయంత్రం వరకు ధరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం వికరాబాద్ జిల్లా ఐడిఓసి భవనంలోని రెండవ అంతస్తు, గది సంఖ్య ఎస్ -17లో ఉన్న జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

★ఇర్విన్ జడ్పిహెచ్ఎస్‌లో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేసిన ఉపసర్పంచ్



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జనవరి 20): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీల నిర్వాహకులు ప్రత్యేక చొరవచూపాలని ఇర్విన్ గ్రామపంచాయతి ఉపసర్పంచ్ గాదెమోని దళపతిగౌడ్ కోరారు. ఈ మేరకు ఇర్విన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజన వంటకాలను పంచాయతి కార్యదర్శి శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి దళపతిగౌడ్ పరిశీలించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వంటకాలు ఎలా ఉంటున్నాయని, గుడ్లు వారానికి ఎన్ని ఇస్తున్నారనే విషయాలు విద్యార్థులను అడిగి తెలుసుకుని .మెనూ ప్రకారం విద్యార్థులందరికి నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, పంచాయతి కార్యదర్శి, ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, సౌకర్యాల పెంపుకు కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరి విద్యార్థుల డ్రాపవుట్ సంఖ్య తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు నాయకులు బొడ్డు శంకర్, మామిడి శివ, సయ్యద్ సలీం, మాడ్గుల కిరణ్, బాతుక రమేష్, బొలెమోని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫతేనగర్‌లో వాసవీ మాత ఆత్మర్పణ దినం భక్తి శ్రద్ధలతో నిర్వహణ



## అమ్మవారికి కిస్మిస్ దండ అలంకరణ, సామూహిక కుంకుమార్చన

కూకట్ పల్లి మేజర్ న్యూస్ : ఫతేనగర్?లోని శ్రీ కన్యకాపరమేశ్వరి నగరేశ్వర అయ్యప్ప దేవస్థానంలో వాసవీ మాత ఆత్మర్పణ దినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కిస్మిస్ దండతో విశేషంగా అలంకరించి, ఆలయాన్ని భక్తి వాతావరణంతో ముంచెత్తారు.కార్యక్రమంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించబడగా, అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.అన్నప్రసాదం దాతలుగా చైర్మన్ శివపురం రామయోగి -- ప్రమీల దంపతులు సేవలందించారు. వారి సేవాభావాన్ని భక్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు దాచేపల్లి నాగేష్ గుప్తా, బొడ్డు కోటేష్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, వీరేశ్ గుప్తా, షణ్ముఖనాథ్ గుప్తా (టీఎస్) తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాసవీ మాత ఆశీస్సులు పొందారు.

# బండచెరువు అభివృద్ధి పనులు ప్రారంభం



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని బండచెరువు వాకర్స్ పార్కులో రూ 16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ర్యాంప్, మెట్లు, చెరువు లో దిగడానికి మెట్లు అలాగే, పార్కిం గ్ స్థలంతో పాటు ఆర్చ్ వంటి ఇతర అభి వృద్ధి పనులను మంగళవారం స్థానిక కార్పొ రేటర్ క్యానం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లాల్ వాణినగర్ కాలనీ అధ్య క్షుడు నరేష్, అసోసియేషన్ సభ్యులు ప్రేమ్ కుమార్, గోపాల్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆనంద్ గౌళికర్, ఓం ప్రకాష్, సంతోష్, జగదీష్ చారి, సాయి సురేష్, గోపా ల్, ఉమాకాంత్, జీహెచచవతీతీచంసీ ఏఈ నవీన్ కుమార్, సూపర్?వైజర్లు సాగర్, వెంకటేష్, హార్టికల్చర్ సూపర్‌వైజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్ర హోటల్స్‌కు ప్రతిష్టాత్మక "లెగసీ రెస్టారెంట్ చైన్" అవార్డు




జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: నగరానికి చెందిన ప్రముఖ ఆహార సంస్థ 'శ్రీ రాఘవేంద్ర హోటల్స్' మరో అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సాధించింది. నగరం లో నిర్వహించిన 'ఫ్రాంఛైజ్ ఇండియా – తెలంగాణ ఙ ఆంధ్రప్రదేశ్ ఎడిషన్ 2025'లో ఈ సంస్థకు "లెగసీ రెస్టారెంట్ చైన్" అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్?లో జరిగిన ఘనమైన వేడుకలో శ్రీ రాఘవేంద్ర కిచెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సోమ నందకిషోర్ గుప్త ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అమేయి మరాతే, క్రీమ్ స్టోన్ ఐస్ క్రీమ్ సీఈఓ శీతల్ పాటిల్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా కర్ణాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ మరియు మహారాష్ట్రలలో కలిపి మొత్తం 67 రెస్టారెంట్లతో ఈ సంస్థ విజయవంతంగా దూసుకుపోతోంది. గుర్తింపు: నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో శ్రీ రాఘవేంద్ర హోటల్స్ పాటిస్తున్న ప్రమాణాలను గుర్తించి ఫ్రాంఛైజీ ఇండియా ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సోమ నందకిషోర్ గుప్త మాట్లాడుతూ ఈ అవార్డు మా సంస్థలోని ప్రతి ఉద్యోగి పడుతున్న కష్టానికి దక్కిన గుర్తింపు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఇటువంటి పురస్కారాలు మాకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయి అని ఆనందం వ్యక్తం చేశారు.

# క్రీడాపోటీలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

★మైసిగండిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సర్పంచ్ ప్రేమజవహర్‌లాల్ నాయక్





కడ్తాల్, మేజర్‌న్యూస్ (జనవరి 20): క్రీడాపోటీలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కడ్తాల్ మండలం మైసిగండి సర్పంచ్ జఠావత్ ప్రేమజవహర్‌లాల్ నాయక్ అన్నారు. గ్రామీణ క్రీడాకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు మైసిగండిలో యువతకు ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఉపసర్పంచ్ కేతావత్ హీరాసింగ్‌నాయక్, వార్డుసభ్యులు, నాయకులతో కలిసి సర్పంచ్ ప్రేమజవహర్‌లాల్ నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులంతా తమలోని ప్రతిభను చాటి జాతీయ, అంతర్జాతీయస్థాయిలకు ఎదగాలని కోరారు. క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని సర్పంచ్ వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుమన్, మాజీ వార్డు సభ్యులు తులసి రామ్ నాయక్, నాయకులు కృష్ణ, సాయికుమార్, సికిందర్, సర్దార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## "సూర్య" దినపత్రిక నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించిన మెడికల్ సూపరింటెండెంట్ డా. బి. నాగేందర్



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌: "సూర్య" దిన పత్రిక నూతన సంవత్సర క్యాలండర్‌ను వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. బెజ్జంశెట్టి నాగేందర్ మంగళవారం తన ఛాంబర్‌లో ఆసుపత్రి వైద్యాధికారులతోకల్సి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా. దామోదర్‌రావు,డా. రాజ్‌కుమార్,డా. రాజీవ్‌సింగ్‌తోపాటు విజయానంద్,లక్ష్మి, సందీప్,శ్రీలత,సూర్య దినపత్రిక సిటీ స్టాఫ్ రిపోర్టర్ జి.శ్రీనివాస్‌జీ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్సీ సంచిత్ గంగ్వార్ ని కలిసిన కార్పొరేటర్ కొత్తపల్లి మీనా

మల్కాజిగిరి, మేజర్ న్యూస్: మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ ని మంగళవారం నేరేడ్ మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె, నేరేడ్?మెట్ డివిజన్ కు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. నేరేడ్?మెట్, యాప్రాల్ పరిధిలో కొత్తగా రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని ప్రతిపాదనలు అందజేశారు. ముఖ్యంగా కొన్ని కాలనీలకు తక్షణమే రోడ్లు అవసర మని కోరారు. నేరేడ్?మెట్ చౌరస్తా వద్ద ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్?కు గత కొన్ని నెలలుగా ఆప రేషన్ అండ్ మెయింటెనెన్స్ లేదని, వెంటనే మెయింటెనెన్స్ ఏజెన్సీకి అప్పగించి, లిఫ్ట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు.